

రిమ్స్‌లో ఎన్‌ఎంసీ బృందం తనిఖీ

రిమ్స్‌లో పీజీ సీట్ల మంజూరు కోసం నేషనల్ మెడికల్ కౌన్సిల్(ఎన్‌ఎంసీ) బృందం మంగళ వారంలు తనిఖీ చేసింది. అన్ని వార్డులను పరిశీలించింది. 10లో▸



ఐటీడీఏ పీవోగా వచ్చేదెవరో..?

ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా ఉన్న వరుణ్‌రెడ్డి ఇటీవల నిర్మల్ జిల్లా కలెక్టర్‌గా నియామకం అయ్యారు. కొత్త పీవోగా ఎవరొస్తారోననే అంశంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
32.0 /15.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. వాయువ్యం దిశగా గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

న్యూస్‌రీల్

హైకోర్టు జడ్జికి విద్యార్థుల పోస్టుకార్డులు



విద్యార్థి రాసిన పోస్టుకార్డు

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే తమకు పదో తరగతిలో తెలుగు, హిందీ బోధనను పండితులు నిలిపి వేశారని విద్యార్థులు మంగళవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి పోస్టుకార్డులు రాసి పంపించారు. భాషా పండితులు పదోన్నతులు, బదిలీల్లో అవకాశం కల్పించాలనే డిమాండ్‌తో దశలవారీ ఆందోళనలో భాగంగా బోధన నిలిపి వేశారని పేర్కొన్నారు. పరీక్షలు సమీపిస్తుండడంతో సబ్జెక్టుల్లో వెనకబడి భవిష్యత్‌పరంగా నష్టం వాటిల్లే అవకాశం ఉందని వాపోయారు. తెలుగు, హిందీ పండితులకు కలిగిన ఇబ్బందిని న్యాయపరంగా తొలగించి వారికి పదోన్నతులు, తమకు బోధన పరంగా న్యాయం చేయాలని కోరారు.

నేడు మున్సిపల్ స్టేడియం ప్రారంభం



పాతమంచిర్యాలలో ఏర్పాటు చేసిన క్రికెట్ గ్రౌండ్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని పాతమంచిర్యాలలో మున్సిపల్ స్థలం ఆరు ఎకరాల్లో ఏర్పాటు చేసిన క్రికెట్ స్టేడియంను ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు బుధవారం ప్రారంభించనున్నారు. శ్రీలక్ష్మీనగర్‌లోని 22 ఎకరాల స్థలం నుంచి ఆరెకరాలు కేటాయించగా.. మున్సిపల్ నిధులు రూ.5 లక్షలు వెచ్చించి మైదానంగా మార్చారు. క్రీడాకారులకు మైదానం అందుబాటులోకి రానుంది.

ఆరోగ్యం కోసం వ్యాయామం చేయాలి




సైకిల్‌ర్యాలీలో డీఎంహెచ్‌వో సుబ్బరాయుడు

మంచిర్యాలటౌన్: ఆరోగ్యంగా ఉండేందుకు వ్యాయామంతోపాటు ఆరోగ్య సూత్రాలు పాటించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుబ్బరాయుడు అన్నారు. అసంక్రమణ వ్యాధులు రాకుండా ఉండేందుకు జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో సైకిల్ ర్యాలీని డీఎంహెచ్‌వో ప్రారంభించారు. రాధాకృష్ణ పాఠశాలలోని విద్యార్థులకు యోగ, ధ్యానం చేయించి వాటి వల్ల కలిగే లాభాలను వివరించారు. డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ సునిల్‌కుమార్, డాక్టర్ ఉపేంద్ర, పాఠశాల ప్రిన్సిపాల్ కె.ప్రవీణ్‌కుమార్, రవి పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ కప్‌కు వాలీబాల్ జట్టు

మంచిర్యాలటౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజును పురస్కరించుకుని తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పురుషుల, మహిళల వాలీబాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా జట్టు మంగళవారం తరలివెళ్లారు. మొదటి బహుమతి రూ.లక్ష, రెండవ బహుమతి రూ.50 వేలు, మూడవ బహుమతి రూ.25 వేలు అందించనున్నారు. తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి ప్రేమ్‌రావు, ఆదిలాబాద్ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు నల్ల శంకర్, ఉపాధ్యక్షుడు బొరె యాదగిరిలు జట్లకు శుభాకాంక్షలు తెలిపారు.

జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థి ప్రతిభ



విద్యార్థి హర్షిన్ బాను

వేమనపల్లి: జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీల్లో నీల్వాయి జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని హర్షిన్‌బాను ప్రతిభకనబర్చింది. ఈ నెల 9నుంచి 12వరకు బిహార్ రాష్ట్రంలోని పాట్నాలో పోటీలు జరిగాయి. 7 వేల మంది పోటీల్లో పాల్గొనగా హర్షిన్ బాను 137వ స్థానాన్ని దక్కించుకుంది. హర్షిన్‌బానును హెచ్‌ఎం సాంబశివరావు, పీఈటీ మల్లేష్ అభినందించారు.

వనాల మాటున వెంచర్లు



'చెట్లకు డబ్బులు కాస్తాయి. మా వెంచర్లలో పెంచే మొక్కలు మీకు భవిష్యత్తులో మంచి లాభాలు తెచ్చిపెడతాయి. ఇప్పుడే కొనుగోలు చేసిన వారికి ప్రత్యేక తగ్గింపు కలదు..' ఇదీ ప్రస్తుతం మంచిర్యాల జిల్లాలో ఫాం ల్యాండ్స్, రిసార్టు, వనాల పేర్లతో సాగుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారం. ఓపెన్ ప్లాట్లు అమ్మేందుకు కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు రూటు మార్చి వనాల మాటున వ్యాపారం చేస్తున్నారు.

- ఫాం ల్యాండ్స్ పేరుతో ప్లాట్ల అమ్మకాలు
- వందల ఎకరాల్లో వెలుస్తున్న అనధికార లే అవుట్లు
- వాణిజ్య మొక్కలు పెంచుతూ, స్కీంలతో ఆకర్షణ
- ప్రభుత్వ అనుమతులు తప్పించుకుంటూ రూ.కోట్ల వ్యాపారం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఓపెన్ ప్లాట్లు అమ్మాలంటే స్థానిక సంస్థల నుంచి అనుమతి ఉండాలి. మొదట వ్యవసాయేతర భూమిగా మార్చినట్లుగా నాలా సర్టిఫికెట్ తీసుకోవాలి. పంచాయతీ, మున్సిపాలిటీల నుంచి డీటీసీపీ ఆమోదం ఉండాలి. రిజిస్ట్రేషన్ ఆఫీసులో క్రయ విక్రయాలు జరగాలి. ఇవన్నీ సరైన ధ్రువపత్రాలు ఉంటేనే సజావుగా సాగుతాయి. ఇటీవల నిబంధనలు కఠినతరం చేయడంతో అన్నీ అనుమతులు ఉంటేనే ప్లాట్ల క్రయ విక్రయాలు అవుతున్నాయి. ఈ 'అనుమతులు' తప్పించుకునేందుకు గతంలో ఉన్న పంట పొలాలనే కాస్త మార్చేసి మళ్లీ ఫాం ల్యాండ్స్‌గా ప్రచారం చేస్తూ రూ.కోట్ల వ్యాపారం చేస్తున్నారు. జిల్లా కేంద్రం చుట్టూ 20కిలోమీటర్ల దూరంలో అనేక పల్లెల్లో 'వనాల వెంచర్లు' వెలిశాయి. ఏజెంట్లను నియమించుకుని కమీషన్లు ఇస్తూ అమ్మకాలు చేపడుతున్నారు. జిల్లాతోపాటు ఇతర జిల్లాల నుంచీ కొనుగోలుదార్లు వస్తున్నారు. ఇప్పటికే హాజీపూర్, లక్సెట్టిపేట, జైపూర్, భీమారం, మందమర్రి, బెల్లంపల్లి, తాండూరు మండలాల్లోని పల్లెల్లో ఈ రకపు వెంచర్లు వెలిశాయి. వందల ఎకరాలు రైతుల నుంచి కొనుగోలు చేస్తూ వనాల పేర్లతో ప్లాట్లు విక్రయించేస్తున్నారు. కొన్ని చోట్ల అసైన్డ్ చేసిన ఎస్సీ రైతుల భూముల్లోనూ వ్యాపా రం చేస్తున్నారు. జాతీయ రహదారులు, ప్రతిపాదిత రోడ్లకు అతి సమీపంలో, వ్యాపార వాణిజ్య కేంద్రాలు, స్టేట్ హైవేలకు దగ్గరగా ఉన్న గ్రామాల్లో దందా ఎక్కువగా చేస్తున్నారు. జిల్లాతోపాటు హైదరాబాద్ నుంచి వ్యాపారులు రూ.కోట్లలో పెట్టుబడులు పెడుతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.

రైతుబంధు యథాతథం

రైతుబంధు సైతం ఇటువంటి ఫాం ల్యాండ్స్‌కు యథావిధిగా రియల్ ఎస్టేట్ ప్లాట్లకు కూడా వస్తున్నాయి. పంట పొలాలను చదును చేసి, గజాల చొప్పున అనేక మందికి అమ్మేస్తూ, క్రయ విక్రయాలు జరిగినా రికార్డుల్లో వ్యవసాయ భూమిగానే ఉండడంతో రైతుబంధు కొనసాగేలా హామీ ఇస్తున్నారు. దీంతో ఇది కూడా అదనపు లాభంగానే చెబుతూ కొనుగోలుదార్లను ఆకర్షిస్తున్నారు.

అనుమతులు లేకుండా అమ్మకాలు

ఎక్కడైనా వెంచరు వేయలాంటే స్థానిక సంస్థలైన గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల నుంచి లే అవుట్ అనుమతులు తప్పనిసరి. అన్ని రకాల ధ్రువపత్రాలు ఉంటేనే అనుమతి వస్తుంది. ఫాం ల్యాండ్స్ పేరుతో సాగుతున్న దందాలో ఎటువంటి అనుమతులు తీసుకోకుండా అమ్మకాలు సాగుతున్నాయి. రెవెన్యూ నుంచి నాలా అనుమతి ఉండడం లేదు. కానీ వెంచరులో రోడ్లు, ప్లాట్ల విభజన, హద్దులు ఉంటున్నాయి. కొనుగోలుదార్లను ఆకర్షించేలా వెంచర్లలో అన్ని రకాల సౌకర్యాలు అంటే గుడి, బడి, పార్కులు, క్రీడా మైదానాలు, స్విమింగ్ పూల్స్, ఆట విడిది కేంద్రాలు తదితర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెబుతున్నారు. అచ్చం ఓపెన్ ప్లాట్ల లే అవుట్ మాదిరిగానే ఏర్పాట్లు చేస్తున్నారు. కానీ పేరు మాత్రం శ్రీగంధం లాంటి మొక్కలతో పెంచుతున్న ఆగ్రో ల్యాండ్స్‌గా చెబుతున్నారు. ఇక సంస్థ ఇచ్చే బ్రోచర్లలో మాత్రం పూర్తిగా నివాస ప్రాంతాల సదుపాయాలు అన్నీ పేర్కొంటున్నారు. వీటిని కొనుగోలు చేసేందుకు కొన్ని సంస్థలు ప్రత్యేక స్కీంలు ఇస్తున్నాయి. ప్లాటు కొనుగోలు చేశాక, పది, పదిహేనేళ్ల తర్వాత మొక్కలు పెరిగాక అమ్మితే వచ్చే వాటాల్లో భాగం, కొన్ని చోట్ల అయితే ప్లాట్ కొన్నప్పటి నుంచే బై బ్యాక్ పాలసీ పేరుతో నెలనెలా కొంత మొత్తంలో డబ్బులు కొనుగోలుదార్లకు ఇస్తామని ఆశ చూపిస్తున్నారు. సింగరేణి, ప్రభుత్వ, ప్రైవేటు, మధ్యతరగతి వారే లక్ష్యంగా రకరకాలుగా ప్రచారం చేస్తూ, ఒకరిని మించి మరొకరు అన్నట్లుగా ఫాం ల్యాండ్స్‌తో వ్యాపారం చేస్తున్నారు.

భార్యపై చేయి చేసుకున్న ఎస్సై

- ఎదురుదాడికి దిగిన భార్య
- కోర్టు సమీపంలో ఘటన
- ఇరువురిపై కేసు నమోదు

మంచిర్యాలక్రైం: మంచిర్యాల కోర్టు సమీపంలో భార్యపై చేయి చేసుకున్న సీబీ సీఐడీ ఎస్సైపై కేసు నమోదైంది. ఎదురుదాడి చేసిన భార్యపైనా పోలీసులు కేసు నమోదు చేశారు. మంచిర్యాల పట్టణ ఎస్సై ఉదయ్‌కిరణ్ మంగళవారం వివరాలు వెల్లడించారు. కరీంనగర్ సీబీ సీఐడీ విభాగంలో పని చేస్తున్న బొల్లం విక్రమ్‌కు పదేళ్ల క్రితం శ్రీరాంపూర్‌కు చెందిన వెన్నంపల్లి సరితతో వివాహమైంది. కొంతకాలం తర్వాత విక్రమ్ తల్లిదండ్రులు అదనపు కట్నం కోసం వేధించారు. దీంతో సరిత ఫిర్యాదు మేరకు స్థానిక మహిళా పోలీసు స్టేషన్‌లో విక్రమ్‌తోపాటు అతడి తల్లిదండ్రులపై అదనపు కట్నం, వేధింపుల కేసు నమోదైంది. కోర్టులో కేసు నడుస్తోంది. ఈ నెల 10న విచారణ నిమిత్తం సరిత తన తండ్రి వెన్నంపల్లి రమేష్‌తో కలిసి కోర్టుకు హాజరైంది. విక్రమ్ తన స్నేహితుడితో కలిసి విచారణ నిమిత్తం వచ్చి కోర్టు సమీపంలో సరిత, రమేష్‌తో గొడవపడ్డాడు. ''నేను సీబీ సీఐడీలో పని చేస్తున్నాను, నన్ను ఎవరూ ఏమీ చేయలేరు. నాతోపాటు తల్లిదండ్రులపై కేసు పెడుతారా.. మిమ్మల్ని చంపేస్తా..''నంటూ బెదిరించడంతో గొడవకు దారితీసింది. సరితపై విక్రమ్ చేయి చేసుకున్నాడు. ఆమె కూడా విక్రమ్‌పై చేయి చేసుకుంది. సరిత డయల్ 100కు కాల్ చేయగా పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఇద్దరిని స్టేషన్‌కు తరలించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ప్రయోగ పరీక్షలకు సిద్ధం

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో ఈ నెల 15నుంచి మార్చి 2వరకు నిర్వహించనున్న ఇంటర్ ప్రయోగ పరీక్షల(ప్రాక్టికల్స్)కు సర్వం సిద్ధం చేశారు. 62 ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో 15,400 మంది విద్యనభ్యసిస్తున్నారు. సైన్స్ విద్యార్థులు 5,656, 1,254 ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారు. మూడు విడతల్లో నిర్వహించి పరీక్షల్లో మొదటి దఫా బుధవారం నుంచి ఈ నెల 20వరకు సాగుతాయి. 16 కళాశాలల్లో ప్రాక్టికల్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రైవేట్ కళాశాలల్లో ప్రభుత్వ కళాశాలల జూనియర్ లెక్చరర్లు ఆరుగురిని డిపార్ట్‌మెంటల్ అధికారులుగా నియమించారు. హాల్‌టికెట్‌లు ఆయా కళాశాలల యాజమాన్యం నుంచి పొందాలని డీఐఈవో శైలజ తెలిపారు.

'ఉపాధి' లక్ష్యాలను పూర్తి చేయాలి

- నిర్లక్ష్యం, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు
- కలెక్టర్ బాదావత్ సంతోష్



మాట్లాడుతున్న కలెక్టర్ బాదావత్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లాలో చేపట్టిన పనుల లక్ష్యాలను వంద శాతం పూరి తచేయాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ విస్తరణాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కాలువలు, చెరువుల్లో పూడికతీత పనులు పూర్తి చేయాలని, పనుల నిర్వహణలో కూలీల హాజరు శాతం పెంచాలని, అధికారులు పనులను నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు. పంచాయతీల్లో కొనసాగుతున్న పనులు, లక్ష్యం, కూలీల సంఖ్య అంశాలపై సమీక్ష నిర్వహించాలని, పురోగతి సాధించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని, విధుల్లో నిర్లక్ష్యం, అలసత్వం వహించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కూలీలకు వంద రోజులు పని కల్పించాలని, పనుల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులతో కార్యాచరణ రూపొందించుకుని లక్ష్యాలను సాధించాలని అన్నారు.

క్రీడాప్రాంగణాలు వినియోగంలోకి తేవాలి

క్రీడా ప్రాంగణాలను త్వరితగతిన పూర్తి వినియోగంలోకి తేవాలని, అవసరమైన సామగ్రి సమకూర్చాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. 311 గ్రామాల్లో 253గ్రామాల్లో ఏర్పాటుకు గుర్తించామని, 22 గ్రామాల్లో పనులు పూర్తి చేశామని, 37గ్రామాల్లో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. క్రీడా ప్రాంగణాల ఏర్పాటులో తలెత్తిన భూ సమస్యల పరిష్కారం దిశగా ఆర్డీవో, తహసీల్దార్లు చొరవ చూపాలని చెప్పారు. స్త్రీ నిధి పథకంలో మహిళా ఆర్థిక స్వావలంబనకు చేపట్టిన కార్యక్రమంలో భాగంగా 79 శాతం బ్యాంక్ లింకేజీ పూర్తి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు బి.రాహుల్, మధుసూదన్‌నాయక్, ట్రెయినీ కలెక్టర్ పి.గౌతమి, జెడ్పీ సీఈవో నరేందర్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శేషాద్రి పాల్గొన్నారు.

కలెక్టర్ విస్తృత పర్యటన

- నర్సరీలు, ప్రకృతి వనాల సందర్శన
- అభివృద్ధి పనుల్లో హాజీపూర్ ఆదర్శమంటూ కితాబు



స్ప్రే చేసే డ్రోన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలో కలెక్టర్ బాదావత్ సంతోష్ మంగళవారం విస్తృతంగా పర్యటించారు. మండలంలోని గుడిపేట, ముల్కల్ల, రాపల్లి, హాజీపూర్ గ్రామాల్లో ఉపాధి హామీ, ఐకేపీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మండలాన్ని జిల్లాలో ఆదర్శంగా నిలిపేలా కృషి చేశారంటూ అభినందించారు. గుడిపేట గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పథకంలో అమృత సరోవర్‌లో భాగంగా చెరువు పూడికతీత పనులు పరిశీలించి కూలీలతో మాట్లాడారు. కూలీ రేట్లు, కొలతల వివరాలు తెలుసుకున్నారు. ముల్కల్ల పంచాయతీలో రైతువేదిక, భూమి అభివృద్ధి పనులు, నర్సరీలో మొక్కల పెంపకం, రాపల్లి పంచాయతీలో పల్లె ప్రకృతి వనం, బృహత్ ప్రకృతి వనం, తెలంగాణ క్రీడా ప్రాంగణాలను పరిశీలించారు. ఐకేపీ ఆధ్వర్యంలో పంట పొలాల్లో ఎరువు, పురుగు మందులు స్ప్రే చేసేలా రూ.10 లక్షలతో కొనుగోలు చేసిన ఆధునిక డ్రోన్ మిషన్ పనితీరును పర్యవేక్షించారు. హాజీపూర్‌లో ఐకేపీ రుణాలతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ఎంబ్రాయిడరీ, బేకరీ దుకాణాలు పర్యవేక్షించి ఆర్థిక, ఉపాధి వివరాలు తెలుసుకున్నారు. అదనపు కలెక్టర్ రాహుల్, శిక్షణ కలెక్టర్ గౌతమి, డీఆర్డీఓ బి.శేషాద్రి, ఎంపీపీ మందపల్లి స్వర్ణలత, సర్పంచులు ఆనె మల్లేశ్, జూపాక రాజేశ్వరి, లగిశెట్టి లక్ష్మి, ఎంపీటీసీ ఒడ్డె బాలరాజ్, ఎంపీడీఓ అబ్దుల్‌హై, ఏపీఓ మల్లయ్య పాల్గొన్నారు.

ఫిర్యాదుదారుల సమస్యలు పరిష్కరించాలి



రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

భీమిని: ఫిర్యాదుదారుల సమస్యలు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెవెన్యూ రికార్డులు పరిశీలించి తహసీల్దార్ లక్ష్మీరాజయ్యను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

'కాంగ్రెస్ వస్తేనే జీవితాల్లో వెలుగులు'



ప్రజలతో మాట్లాడుతున్న పటోళ్ల సంజీవరెడ్డి

మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రజల జీవితాల్లో వెలుగులు వస్తాయని కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి పటోళ్ల సంజీవరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. మంగళవారం మంచిర్యాల మున్సిపాలిటీలోని అశోక్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించి, హాథ్ సే హాథ్ జోడో అభియాన్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణ, పీసీసీ సభ్యుడు కొండ చంద్రశేఖర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు పెంట రజిత, పట్టణ మహిళా అధ్యక్షురాలు గజ్జెల హేమలత, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు రామగిరి బానేష్, మున్సిపల్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మజీద్, కౌన్సిలర్లు సల్ల మహేష్, జోగుల శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు హక్కు పత్రాలు అందించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

దండేపల్లి: మండలంలోని కోయపోచగూడ ఆదివాసీ గిరిజనులకు మొదటి హక్కు పత్రాలను అందించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆశన్న ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పార్టీ నాయకులతో కలిసి మంగళవారం కోయపోచగూడ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోడు భూములకు హక్కు పత్రాలు ఇస్తామని అసెంబ్లీలో సీఎం కేసీఆర్ ప్రకటించడం హర్షణీయమని అన్నారు. సాగు భూముల కోసం కోయపోచగూడ గిరిజనులు పోరాటాలు చేసి కేసుల పాలయ్యారని తెలిపారు. అనంతరం దండేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో గిరిజనులతో కలిసి తహసీల్దార్ హన్మంతరావుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సంకె రవి, అబ్దుల్ల, రమేష్, రాజలింగు, విజయ్, లచ్చగౌడ్, రవి, బాపు, ఎల్లయ్య, పోశమ్మ, శ్యామల, లావణ్య, రమేష్, పోషం, నరేష్ పాల్గొన్నారు.

నడక గోస తప్పట్లే..

- ఆర్కే 7 గనిలో పని చేయని మ్యాన్ రైడింగ్
- ఆరు నెలలుగా బంద్
- ఇబ్బందులు పడుతున్న కార్మికులు
- మరమ్మతులు చేసినా.. పునఃప్రారంభంలో అలసత్వం



నిరుపయోగంగా ఉన్న మ్యాన్ రైడింగ్ యంత్రం

శ్రీరాంపూర్: ఆర్కే 7 గని కార్మికులు భూగర్భంలోకి దిగడానికి నడకతో తీవ్ర ఇబ్బందుల పడుతున్నారు. అన్ని గనుల్లో కార్మికులు మ్యాన్‌రైడింగ్ ద్వారా గనుల్లోకి దిగుతుంటే ఆర్కే 7 గని కార్మికులు నడుచుకుంటూనే పనులకు వెళ్లాల్సి వస్తోంది. గనిలో చైర్ కార్ మ్యాన్ రైడింగ్ యంత్రం ఉన్నా బ్రేక్‌డౌన్‌తో పూర్తిగా నిలిచిపోయింది. శ్రీరాంపూర్‌లో అతిపెద్ద గనుల్లో ఒకటైన ఈ గనిలో మ్యాన్‌రైడింగ్ పనిచేయకపోవడంతో కార్మికవర్గం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. 2021లో గని సర్ఫేస్ నుంచి 2 లెవల్ వరకు ఏర్పాటు చేసిన ఈ చైర్ కార్ మ్యాన్ రైడింగ్ యంత్రం సాంకేతిక కారణాలతో 6 నెలల క్రితం నిలిచిపోయింది. అప్పటి వరకు ఇది సవ్యంగానే నడుస్తుండగా గనుల్లో రక్షణ చర్యలు పర్యవేక్షించే డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ శాఖకు చెందిన డీఎంఎస్ దీన్ని తనిఖీ చేసిన సందర్భంగా ఇందులోని సేఫ్టీ పరమైన సాంకేతిక లోపాలు గుర్తించి దీన్ని నిలిపివేయాలని ఆదేశించారు. బ్రేక్ కంట్రోలింగ్ సిస్టం సరిగ్గా లేకపోవడంతో సేఫ్టీ ఉల్లంఘన కింద దీనిని నిలిపివేయించారు. అప్పటి నుంచి ఇది పూర్తిగా నిలిచిపోయింది. డీఎంఎస్ చూపిన అభ్యంతరాలను సరిచేసేందుకు గని అధికారులు గుజరాత్ వంటి ప్రాంతాల నుంచి మెకానికల్, ఎలక్ట్రికల్ యంత్రాలను తెప్పించి బిగించారు. సుమారు రూ.40 లక్షల వెచ్చించి బాగు చేశారు. అయితే దీన్ని తిరిగి పునః ప్రారంభించాలంటే డీఎంఎస్ వచ్చి మళ్లీ తనిఖీ చేసిన తరువాత అంతా సవ్యంగా ఉంటేనే నడుపడానికి అనుమతి ఇస్తారు. దీన్ని ఎప్పుడు తనిఖీ చేస్తారో, అనుమతి ఇస్తారో అని కార్మికులు ఎదురుచూస్తున్నారు. అధికారుల జాప్యం వల్లే ఆలస్యం అవుతుందని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సీనియర్ కార్మికులకు తీవ్ర ఇబ్బందులు...

రిటైర్మెంట్ దగ్గర పడిన సీనియర్ కార్మికుల్లో చాలా మంది మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. వారు కాలినడకన నడవలేకపోతున్నారు. చైర్ కార్ మ్యాన్‌రైడింగ్ పని చేయకపోవడంతో నడుచుకుంటూ వెళ్లడంతోనే అలసిపోతున్నామని, అక్కడికి వెళ్లాక పనులు చేయాలంటే మరింత ఇబ్బంది అవుతుందని కార్మికులు వాపోతున్నారు. చాలా సార్లు అధికారులకు మొరపెట్టుకున్నామని, ప్రతీసారి త్వరలో మ్యాన్ రైడింగ్ మొదలు అవుతుందని చెప్పడమే తప్ప ఇప్పటికీ ప్రారంభం కాలేదని వాపోతున్నారు.

అధికారుల జాప్యమే కారణం



అధికారుల జాప్యం వల్లే చైర్ కార్ మ్యాన్‌రైడింగ్ యంత్రం పునః ప్రారంభం కాలేదు. దీనికి మరమ్మతులు చేసి బాగు చేసిన కూడా అనుమతులు రావాల్సి ఉందంటూ తీవ్ర ఆలస్యం చేస్తున్నారు. వెంటనే మ్యాన్ రైడింగ్‌ను నడిపించి కార్మికుల ఇబ్బందులు తీర్చాలి.

– తిప్పారపు సారయ్య, హెచ్‌ఎమ్మెస్ బ్రాంచీ కార్యదర్శి

వారం రోజుల్లో నడిపిస్తాం

డీఎంఎస్(మెకానికల్)నుంచి అనుమతి రావాల్సి ఉంది. వారికి అనుమతి కోసం లేఖ రాశాం. త్వరలో వచ్చే అవకాశం ఉంది. వారం రోజుల్లో దీన్ని నడిపిస్తాం.

– బి.సంజీవరెడ్డి, జీఎం, శ్రీరాంపూర్

'డంపింగ్‌యార్డు నిర్మాణంలో ఎమ్మెల్యే విఫలం'



భరోసా యాత్రలో రఘునాథ్, కార్యకర్తలు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీకి శాశ్వత డంపింగ్ యార్డు నిర్మాణంలో ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు విఫలమయ్యారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి విమర్శించారు. జిల్లా కేంద్రంలో ప్రజాగోస-బీజేపీ భరోసా యాత్రను మంగళవారం ఆండాళమ్మ కాలనీలో ప్రారంభించారు. బీజేపీ స్ట్రీట్ కార్నర్ సమావేశం నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించారు. అనంతరం గ్రీన్ సిటీ, గొల్లవాడ, హైటెక్‌సిటీ కాలనీ, ఒడ్డెర కాలనీ, లక్ష్మీనగర్, గౌతమినగర్ మీదుగా పాదయాత్ర నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, పెద్దపల్లి పురుషోత్తం, అరుముళ్ల పోషం, అశోక్‌వర్ధన్, రవీందర్‌రావు, పచ్చ వెంకటేశ్వర్లు, అరెందుల శ్రీనివాస్, పల్లి రాకేశ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

తాంసి: మద్యం మత్తులో యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని వామన్‌నగర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మేస్రం సుదర్శన్-నీలాబాయి దంపతులు వ్యవసాయ కూలీలు. వీరి కుమారుడు శ్రీనివాస్(22) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మద్యం మత్తులో సోమవారం అర్ధరాత్రి ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం కుటుంబసభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్సై కేశవ్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహానికి పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తండ్రి సుదర్శన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

దుప్పిని కాపాడిన యువకుడు



దుప్పితో వెంకటేశ్

భీమారం: మంచిర్యాలలో అటవీ డివిజన్ పరిధిలోని పొలంపల్లి గ్రామ సమీపంలో కుక్కల దాడి నుంచి మంగళవారం చుక్కల దుప్పిని సుందిళ్ల వెంకటేష్ కాపాడాడు. తాగునీటి కోసం అడవి నుంచి బయటకు వచ్చిన దుప్పిని కుక్కలు వెంబడిస్తూ పరుగెత్తించాయి. దుప్పి అనాథాశ్రమం గోడ వద్ద ఆగి ఉండగా గమనించిన వెంకటేష్ రక్షించాడు. అటవీ శాఖ అధికారులకు గ్రామస్తులు సమాచారం అందించారు. స్వల్పంగా గాయపడ్డ దుప్పికి చికిత్స చేసి అడవిలో వదిలేశారు.

ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా

- డ్రైవర్‌తో పాటు మరొకరికి స్వల్ప గాయాలు



గాయపడిన డ్రైవర్ లక్ష్మణ్

బెజ్జూర్(సిర్పూర్): బెజ్జూర్ మండలం కుశ్నపల్లి వద్ద మంగళవారం ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడి ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. మండల కేంద్రానికి చెందిన పెద్దల శంకర్‌కు చెందిన ట్రాక్టర్‌ను డ్రైవర్ మెర్పల్లి లక్ష్మణ్ బెజ్జూర్ నుంచి కుశ్నపల్లి వైపు తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో గోల్కొండ సమీపంలో ట్రాక్టర్ ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌తోపాటు ట్రాక్టర్‌పై ఉన్న టేకం పులయ్యకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వృద్ధుడి ఆత్మహత్య



పోశం మృతదేహం

నెన్నెల: మండలంలోని చిత్తాపూర్ గ్రామానికి చెందిన వడ్నాల పోశం(80) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. పోశం కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. సోమవారం సాయంత్రం నొప్పి తీవ్రం కావడంతో భరించలేక పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. కుటుంబీకులు 108 అంబులెన్స్‌లో మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం చనిపోయాడు. పెద్ద కుమారుడు సర్వోత్తం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఐటీడీఏ పీవోగా వచ్చేదెవరో?

- వరుణ్‌రెడ్డి బదిలీతో ప్రాజెక్టు ఆఫీసర్ పోస్టు ఖాళీ
- ప్రచారంలో వరుణ్‌రెడ్డి సతీమణి పేరు
- మరో కీలక అధికారి సైతం జోరుగా పైరవీ?



ఐటీడీఏ కార్యాలయం

ఉట్నూర్: సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థకు ప్రాజెక్టు అధికారిగా ఎవరు వస్తారోననే ఉత్కంఠ ఏజెన్సీలో నెలకొంది. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా ఐటీడీఏ పీవోగా విధులు నిర్వహిస్తున్న వరుణ్‌రెడ్డిని నిర్మల్ కలెక్టర్‌గా నియమించిన విషయం విధితమే. ఐటీడీఏకు ప్రాజెక్టు అధికారిగా ఎవరినీ నియమించకపోవడంతో ప్రస్తుతం ఇన్‌చార్జీగా వరుణ్‌రెడ్డి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అయితే పీవోగా వరుణ్‌రెడ్డి సతీమణి, కుమురంభీం జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ వస్తారని ప్రచారం ఉంది. అలాగే ఐటీడీఏలో కీలక పోస్టులో కొనసాగుతున్న ఓ అధికారి సైతం ప్రాజెక్టు అధికారిగా వచ్చేందుకు జోరుగా పైరవీ చేస్తున్నట్లు సమాచారం.

ఐటీడీఏనే కీలకం...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదివాసీ గిరిజనుల అభివృద్ధికి ఉట్నూర్ ఐటీడీఏనే కేంద్ర స్థానం. ఐటీడీఏ పరిధిలో ఉమ్మడి జిల్లాలోని 38 మండలాలు ఉన్నాయి. ఇందులో ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడ, జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్ మండలాలు పూర్తిస్థాయి ఏజెన్సీ మండలాలు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న 4.95 లక్షల ఆదివాసీ గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా పలు కార్యక్రమాలు చేపడుతోంది. అయితే కొంతకాలంగా ఐటీడీఏకు పీవోగా వస్తున్న అధికారులు కనీసం రెండేళ్లు గడవకుండానే బదిలీపై వెళ్తుండడంతో పాలన గాడి తప్పుతుందనే ఆరోపణలున్నాయి.

వరుణ్‌రెడ్డి బదిలీతో...

ఐటీడీఏ పీవోగా వరుణ్‌రెడ్డిని ప్రభుత్వం గతేడాది జూన్ 13న నియమించింది. అయితే జనవరి 31న ఐఏఎస్‌ల బదిలీల్లో భాగంగా ఆయనను నిర్మల్ కలెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఐటీడీఏకు కొత్త పీవోగా ఎవరినీ నియమించకపోవడంతో వరుణ్‌రెడ్డికే ఇన్‌చార్జి బాధ్యతలూ అప్పగించింది. ఓవైపు కలెక్టర్‌గా, మరోవైపు పీవోగా ఇన్‌చార్జి బాధ్యతల నేపథ్యంలో ఐటీడీఏ పాలనపై ప్రభావం చూపే అవకాశం ఉంటుందని ఆదివాసీ, గిరిజన నాయకులు అంటున్నారు. పూర్తిస్థాయి పీవోను త్వరగా నియమించాలని వారు కోరుతున్నారు.

ఇద్దరిలో ఎవరో..?

ఓవైపు వరుణ్‌రెడ్డి సతీమణి, ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌ని ప్రభుత్వం పీవోగా నియమిస్తుందని కొద్ది రోజులుగా ఏజెన్సీలో ప్రచారం సాగుతుంది. మరోవైపు ఐటీడీఏలో కొద్ది నెలల క్రితం కీలక బాధ్యతలు చేపట్టిన ఓ అధికారి సైతం పీవోగా వచ్చేందుకు జోరుగా పైరవీ చేస్తున్నట్లు ప్రచారం ఉంది. సదరు అధికారికి ఉమ్మడి జిల్లాలోని ఓ మాజీ ఎమ్మెల్యే అండదండలున్నట్లు తెలిసింది. ప్రస్తుతం సదరు అధికారికి చెందిన ఫైల్ ప్రభుత్వ పెద్దల వద్ద ఉందని, వారం పది రోజుల్లో ఉత్తర్వులు కూడా వెలువడుతాయని ఐటీడీఏలో గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఇద్దరిలో ఎవరికైనా పీవోగా బాధ్యతలు అప్పగిస్తుందా.. లేక కొత్తవారిని తీసుకువస్తుందా అనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

'మన బడి' మార్చింది..!

మంచిర్యాలరూరల్(హాజీపూర్): 'మన ఊరు–మన బడి' పథకంలో భాగంగా చేపట్టిన పనులతో ప్రభుత్వ బడి మారింది. కొత్త కొత్తగా దర్శనమిస్తోంది. జిల్లాలో 210 ప్రాథమిక, 96 ప్రాథమికోన్నత, 108 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో మొదటి విడతగా 245 పాఠశాలల్లో 'మన ఊరు–మన బడి'పనులు చేపట్టారు. రూ.9.05 కోట్లతో పనులు చేపట్టగా ఇందులో పనులు పూర్తయ్యి కొత్త హంగులతో రూపుదిద్దుకున్న 36 ప్రభుత్వ పాఠశాలలను ఫిబ్రవరి 1న ఎమ్మెల్యేలు, కలెక్టర్ ప్రారంభించారు. ఈ పథకంలో ఎంపికైన పాఠశాలల్లో కార్పొరేట్ తరహాలో సౌకర్యాలు కల్పించారు. శిథిల భవనాల స్థానంలో నూతన నిర్మాణాలు, మరమ్మతులు, విద్యుద్దీకరణ పనుల్లో భాగంగా తరగతి గదుల్లో ఫ్యాన్లు, లైట్లు, తాగునీటి వసతి, నిరంతర నీటి సరఫరాతో మరుగుదొడ్లు, విద్యార్థులు, ఉపాధ్యాయులకు నూతన ఫర్నిచర్, గ్రీన్ చాక్ బోర్డులు, డ్యూయల్ డెస్క్‌లు, అల్మారాలు, బోధనా సౌకర్యాలు, పాఠశాలకు రంగులు, ప్రహరీ, వంటగది, ఉన్నత పాఠశాలల్లో భోజన వసతి తదితర సౌకర్యాలు కల్పించారు. పాఠశాలలు ఆకర్షణీయంగా తీర్చిదిద్దడంతో కార్పొరేట్‌కు దీటుగా రూపురేఖలు మారాయి. హాజీపూర్ మండలం సబ్బెపల్లి ప్రాథమిక పాఠశాల కార్పొరేట్‌కు దీటుగా ముస్తాబైంది. రూ.16 లక్షలతో మౌలిక వసతులు, అభివృద్ధి పనులు చేపట్టారు. స్థానికుడు, మాజీ జెడ్పీటీసీ హరిప్రియ, వినయ్‌ప్రకాశ్‌రావు దంపతులు పాఠశాలకు రూ.5 లక్షల విరాళం అందజేయగా ఆట పరికరాలు, ఆధునిక నీటి ట్యాంకు నిర్మాణ పనులకు ఉపయోగించారు. కొత్తగా మారిన పాఠశాల విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది.



పాఠశాల ఆవరణలో చిన్నారుల ఆట పరికరాలు



డ్యూయల్ బెంచ్‌లపై చదువుతున్న విద్యార్థులు



సబ్బెపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

శతశాతం కంటి పరీక్షలు నిర్వహించాలి



శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

నెన్నెల: గ్రామాల్లో వంద శాతం కంటి పరీక్షలు నిర్వహించాలని, అందరికీ సేవలు అందేలా చూడాలని జిల్లా వైద్యాధికారి సుబ్బరాయుడు సిబ్బందికి సూచించారు. మండలంలోని చిత్తాపూర్‌లో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. 18ఏళ్లు పైబడిన వారందరిని స్క్రీనింగ్ చేసుకునేలా ప్రోత్సహించాలని సిబ్బందిని ఆదేశించారు. రోగుల నమోదుతో పాటు పరీక్షల ఏర్పాట్లను పరిశీలించి సలహాలు, సూచనలు చేశారు. కంటి వెలుగు శిబిరాల్లో ప్రతి ఒక్కరూ నేత్ర పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఉచితంగా పరీక్షలు చేయడంతో పాటు అవసరమైన వారికి కళ్లద్దాలు అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం నెన్నెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట తహసీల్దార్ భూమేశ్వర్, మెడికల్ ఆఫీసర్ ఝాన్సీ, వైద్య సిబ్బంది ఉన్నారు.

వండర్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు



సర్టిఫికెట్లు అందుకుంటున్న విశ్వేశ్వరశర్మ

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల లలితా సేవా సమితి ఆధ్వర్యంలో 108 మందితో 108 గృహాల్లో 108 సార్లు 108 రోజులు లలిత పారాయణం చేసినందుకు ఇంటర్నేషనల్ వండర్‌బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కించుకున్నారు. మంగళవారం మంచిర్యాలలో లలితా సేవా సమితి సభ్యులతోపాటు కార్యక్రమంలో పాల్గొన్న వారి పేర్లతో సర్టిఫికెట్లను సంస్థ స్టేట్ కో–ఆర్డినేటర్ రాంప్రకాశ్ అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దివాకర్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, సంస్థ నిర్వాహకుడు విశ్వేశ్వర శర్మ, సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో రాణించడం అభినందనీయం



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ అవార్డు పోటీల్లో జిల్లా విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన చేసి జాతీయ అవార్డు పొందడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్, ట్రెయినీ కలెక్టర్ పి.గౌతమితో కలిసి జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ అవార్డు పోటీల్లో జిల్లా కేంద్రంలో శ్రీచైతన్య పాఠశాల విద్యార్థిని సాయిలు సాయి, శ్రీవల్లి మహిళలకు ఉపయోగపడే రుతుమిత్ర తయారు చేసి జాతీయ స్థాయి అవార్డు పొందడం సంతోషంగా ఉందని తెలిపారు. కేరళలో నిర్వహించిన దక్షిణ భారత స్థాయి విజ్ఞాన ప్రదర్శనలో గైడ్ ఉపాధ్యాయుడు దేవ రాజయ్య ఆధ్వర్యంలో జాడి జగదీశ్వర్ తయారు చేసిన ఎలక్ట్రికల్ స్పైడర్ క్లీనర్ ద్వితీయ బహుమతి పొందారని, టీచర్ టీఎల్ఎంలో తాండూర్ మండల కాసిపేట మండల ప్రాథమికోన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు గంప శ్రీనివాస్ అత్యుత్తమ ప్రతిభ కనబరచడం అభినందనీయమని తెలిపారు. జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో తడి, పొడి చెత్త నిర్వహణ కొనసాగుతున్న కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. చెత్త విభజన–నిర్వహణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మధుబాబు, సెక్టోరల్ సమన్వయకర్త చౌదరి, జన్నారం మండల విద్యాధికారి విజయ్‌కుమార్, శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపల్ జోబిన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



ధర్మన్న (ఫైల్)

తానూరు: మండలంలోని హిప్నెల్లి ఎక్స్‌రోడ్డు వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. ఎల్వి గ్రామానికి చెందిన జొరిగల్ ధర్మన్న(52) ద్విచక్ర వాహనంపై ముథోల్ నుంచి ఎల్వికి వెళ్తున్నాడు. హిప్నెల్లి ఎక్స్‌రోడ్డు వద్ద ఇటుకలతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ధర్మన్న వెనుక నుంచి ఢీకొని రోడ్డుపై పడ్డారు. హెల్మెట్ లేకపోవడంతో తలకు బలమైన గాయాలై అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ధర్మన్నకు భార్య చంద్రకళ, కూతురు, కుమారుడు

ఓబీ వెలికితీత పెంచాలి



శ్రీరాంపూర్: పరిశీలిస్తున్న అధికారులు

శ్రీరాంపూర్: ఆర్థిక సంవత్సరం సమీపిస్తున్న తరుణంలో మిగిలిన ఉత్పత్తి లక్ష్యాల సాధనకు ఓసీపీల్లో ఓబీ వెలికితీత సామర్థ్యం మరింత పెంచాలని కంపెనీ మైనింగ్ అడ్వయిజర్ డీఎన్ ప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన శ్రీరాంపూర్ ఓసీపీని సందర్శించారు. క్వారీ వ్యూపాయింట్ వద్ద ఏరియా జీఎం బీ.సంజీవరెడ్డితో కలిసి ఓబీ, బొగ్గు వెలికితీత పనులపై సమీక్షించారు. సాధించాల్సిన ఉత్పత్తిపై చర్చించారు. ఓబీ తీస్తేనే బొగ్గు తీయడం సాధ్యం అవుతుందని, ఓబీ పనులు వేగంగా చేయాలని అన్నారు. ఓసీపీ భూ సేకరణ, డంప్‌యార్డు, కోల్ క్వాలిటీ, మిషనర్ల పనితీరుపై ఆయన ఏరియా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ సుధీర్, సర్వే అధికారి రాంమోహన్, ఓబీ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలి

జైపూర్: ఈ ఏడాది వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధిస్తూ రవాణా, ఓబీ లక్ష్యాలను ఛేదించాలని అడ్వయిజర్ మైనింగ్ ప్రసాద్ తెలిపారు. మండలంలోని ఇందారం ఓపెన్‌కాస్టు గనిని మంగళవారం శ్రీరాంపూర్ జీఎం బి.సంజీవరెడ్డితో కలిసి సందర్శించారు. ఉపరితల గనిలో బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓబీ వెలికితీత, భూసేకరణ సంబంధిత అంశాలపై సమీక్షించారు. అనంతరం ఓసీపీ వ్యూ పాయింట్ నుంచి పని స్థలాలను పరిశీలించారు. ఇందారం ఓసీపీ గనిలో రోజువారీ ఉత్పత్తి లక్ష్యాలు సాధించడం, రోజువారీ ఓబీ వెలికితీత లక్ష్యాల సాధనకు తీసుకుంటున్న చర్యలను అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ రవికుమార్, గని ఆపరేషన్ మేనేజర్ బ్రహ్మాజీ, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్సైని గాయపరిచిన యువకుడి అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: ఎస్సైని గాయపర్చిన ఓ యువకుడిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై హరిబాబు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌక్ సమీపంలో సోమవారం రాత్రి ఎస్సై కలీం డ్రంక్ అండ్ డ్రైవ్, వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఖుర్షీద్‌నగర్ కాలనీకి చెందిన సద్దాం అనే యువకుడు ఎస్సైని నెట్టివేయగా గాయాల పాలయ్యారు. మద్యం మత్తులో యువకుడు దురుసుగా ప్రవర్తించడంతోనే ఎస్సైకి గాయాలైనట్లు తెలిపారు. ఈ మేరకు యువకుడిపై కేసు నమోదు చేయడంతో పాటు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

హైదరాబాద్ ధర్నాకు తరలిన బీఎంఎస్ నాయకులు



శ్రీరాంపూర్: రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మంగళవారం బీఎంఎస్ ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ వద్ద ధర్నా నిర్వహించారు. దీనికి బీఎంఎస్ నుంచి ఆ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేశ్, శ్రీరాంపూర్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, కార్యదర్శి నాతాడి శ్రీధర్‌రెడ్డిలతో పాటు పలువురు నేతలు హాజరయ్యారు. సింగరేణిని రక్షించుకోవడం కోసం ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని వారు పిలుపునిచ్చారు. బొగ్గు బ్లాకుల వేలంను అడ్డుకోవాలని ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు కనీసం వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయూనియన్ నాయకులు పూనం రామకృష్ణ, గోపతి సందీప్‌లు పాల్గొన్నారు.

సామూహిక హనుమాన్ పారాయణం



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

లక్సెట్టిపేట: మండలంలోని కొత్తూరు గ్రామంలో హనుమాన్ ఆలయంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం 108వ వారం విజయవంతంగా నిర్వహించారు. ప్రతి మంగళవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం తొమ్మిది గంటల వరకు భక్తులు పెద్దమొత్తంగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ పారాయణంలో భక్తులు పాల్గొని పాటలు పాడుతు, భజనలు చేస్తు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని భక్తులు నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ప్రమాదానికి గురైన ఆటోను పరిశీలిస్తున్న ఎస్సై భూమేశ్

రెబ్బెన(ఆసిఫాబాద్): తిర్యాణి మండలంలోని కైరిగూడ ఓసీపీ వెళ్లే దారిలో పావురాల గుట్ట సమీపంలో మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో చోపిడి గ్రామానికి చెందిన ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. తిర్యాణి మండలం చోపిడి గ్రామానికి చెందిన టేకం మారుతి, టేకం భీంరావు సొంత పని నిమిత్తం గోలేటికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి ఆటోలో బయలుదేరారు. మార్గమధ్యలో పావురాలగుట్ట సమీపంలోకి రాగానే కైరిగూడ వైపు నుంచి గోలేటి వైపు వెళ్తున్న జేసీబీ ఎదురుగా ఆటోను ఢీకొట్టింది. ఆటో ముందు భాగం నుజ్జునుజ్జు కావడంతో డ్రైవర్ మారుతి తలకు, వెనుక కూర్చున్న భీంరావ్ ఎడమ కాలికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 సిబ్బందితోపాటు రెబ్బెన ఎస్సై భూమేశ్‌కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న 108 ఈఎంటీ శవంత, పైలెట్ సంతోష్ హుటాహుటిన క్షతగాత్రులను బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్సై ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

తెగిపడిన హైటెన్షన్ విద్యుత్ తీగలు



బూరుగుపల్లి(కే) గ్రామంలో ఓ ఇంటిపై తెగిపడిన 11 కేవీ వైర్లు

నర్సాపూర్(జి): మండలంలోని బూరుగుపల్లి(కె) గ్రామంలో మంగళవారం సాయంత్రం పలువురి ఇళ్లపై హైటెన్షన్(11కేవీ) విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. వెంటనే గ్రామస్తులు సబ్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. గతంలో కూడా రెండుసార్లు 11 కేవీ తీగలు తెగిపడ్డాయని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో ఇళ్ల పైనుంచి 11 కేవీ విద్యుత్ తీగలు ఉన్నాయిని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియడం లేదని పేర్కొన్నారు. పల్లె ప్రగతిలో ఇళ్లపై ఉన్న విద్యుత్ తీగలు తొలగిస్తామని చెప్పిన అధికారులు ఇప్పటి వరకు తొలగించలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఊరంతా విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి 11 కేవీ తీగలను ఇళ్ల పైనుంచి తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

గుర్తు తెలియని బాలుడి అప్పగింత



బాలుడితో సీడీపీవో నాగలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్

భైంసాటౌన్: బస్సులో అనుమానాస్పదంగా ప్రయాణిస్తున్న ఓ గుర్తుతెలియని బాలుడిని ఐసీడీఎస్ అధికారులు పట్టణంలోని వివేకానంద ఆవాసంలో అప్పగించారు. కుభీర్ సెక్టార్‌కు చెందిన అంగన్‌వాడీ టీచర్ అనసూయ మంగళవారం భైంసా నుంచి నిర్మల్‌కు ఆర్టీసీ బస్సులో వెళ్లింది. తిరిగి భైంసాకు వస్తున్న క్రమంలో ఓ బాలుడు కనిపించడంతో చిరునామా కోసం ఆరా తీసింది. బాలుడు వివరాలు తెలుపకపోవడంతో భైంసాలోని సీడీపీవో కార్యాలయంలో సీడీపీవో నాగలక్ష్మి దృష్టికి తీసుకురాగా, వారు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బాలుడి వివరాలు నమోదు చేయించారు. అనంతరం స్థానిక వివేకానంద ఆవాసంలో అప్పగించారు. బాలుడి కుటుంబీకులు ఎవరైనా ఉంటే సంప్రదించాలని సూచించారు.

జాతీయస్థాయి పోటీల్లో గోల్డ్ మెడల్



కోచ్ రాజుతో సపావత్ రమ్య

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ క్రీడా పాఠశాలకు చెందిన విద్యార్థి సపావత్ రమ్య మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో జరుగుతున్న రెండో ఖేలో ఇండియా జాతీయ మహిళల పోటీల్లో జూడో క్రీడలో స్వర్ణ పతకం సాధించింది. డీవైఎస్వో వెంకటేశ్వర్లు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, పార్థసారథి, కోచ్ రాజు అభినందించారు.

పొట్టేలు అపహరణ

ఖానాపూర్: మండలంలోని పాత ఎల్లాపూర్ గ్రామానికి చెందిన ఏనుగుల రాములు విలువైన పొట్టేలు చోరీ అయింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం నుంచి ఏడాది క్రితం రూ.30 వేలకుపైగా వెచ్చించి పొట్టేలును కొనుగోలు చేసి తెచ్చాడు. సోమవారం రాత్రి దొంగలు కొట్టంలోని మంద నుంచి ఆ పొట్టేలును ఎత్తుకెళ్లారు. మంగళవారం పొట్టేలు కనిపించకపోవడంతో ఆందోళన చెందాడు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దాని విలువ సుమారు రూ.40 వేలు ఉంటుందని పేర్కొన్నాడు. 2017లోనూ తమ కొట్టంలోని ఆరు మేకలు చోరీ అయ్యాయిని తెలిపాడు.



పుల్వామా అమరులకు నివాళి

జిల్లా కేంద్రంలోని చింతకుంటవాడ కాలనీలో పుల్వామా అమరవీరులకు మంగళవారం రాత్రి నివాళులర్పించారు. ఛత్రపతి శివాజీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో జోహార్లు అర్పించారు. –నిర్మల్‌టౌన్